# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-10-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.**
2. **రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది.**
3. **ప్రకృతి వనరులను వినియోగించుకుని కాలుష్యరహితంగా 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**
4. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.**
5. **అంతర్జాతీయ ప్రకృతి విపత్తుల ప్రభావ నియంత్రణ దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిధులను నిన్న విడుదల చేసింది. దీనిపై మరింత సమాచారాన్ని మా ఆకాశవాణి ప్రతినిధి సాయి అందిస్తారు.

(వాయిస్ ..20 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేపటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని 13 వేల 324 గ్రామాల్లో ఒకేసారి పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభించనున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో నిర్వహించే వారోత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. పల్లె పండుగలో భాగంగా దాదాపు 4 వేల 500 కోట్ల రూపాయలతో 30 వేల పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. మొత్తం 3 వేల కిలోమీటర్ల మేర కచ్చా రహదారులు, 500 కిలోమీటర్ల తారు రోడ్లు, వ్యవసాయ కుంటలు, పశువుల శాలలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

--------------------------

ప్రకృతి వనరులను వినియోగించుకుని కాలుష్యరహితంగా 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో 36.50 కోట్ల రూపాయలతో నిర్మించిన 2.5 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఉపముఖ్యమంత్రి

భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిన్నప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వాయు కాలుష్యాన్ని, కర్బన ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భారీ వర్షాల నేపథ్యంలో బలహీనంగా ఉన్న కాలువలు, చెరువు గట్లను పటిష్టం చేయాలని హోం మంత్రి వి.అనిత కలెక్టర్లను, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 1800-425-0101ను సంప్రదించాలని కోరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులు, కాలువలు, రోడ్లు, కల్వర్టులకు దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

---------------------------

తెలంగాణా ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి మొదటిసారిగా ముఖ్యమంత్రి హోదాలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో 72 లక్షల రూపాయలతో నిర్మించిన కొత్త పంచాయతీ భవనం, 55 లక్షల రూపాయలతో గ్రంథాలయం, 45లక్షల రూపాయలతో బీసీ సామాజిక భవనం, 45 లక్షల రూపాయలతో చేపట్టిన పశు వైద్యశాల భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

---------------------------

అంతర్జాతీయ ప్రకృతి విపత్తుల ప్రభావ నియంత్రణ దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ప్రకృతి విపత్తుల వల్ల సంభవించే నష్టాన్ని తగ్గించి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంపై అవగాహన కల్పించేందుకు 1989వ సంవత్సరం నుండి ప్రతి ఏటా అక్టోబర్ 13వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రకృతి విపత్తుల ప్రభావ నియంత్రణ దినాన్ని నిర్వహిస్తోంది. దేశంలో విపత్తు నిర్వహణ చట్టం 2005 ప్రకారం విపత్తు నిర్వహణపై జాతీయ విధానాన్ని రూపొందించారు. సమగ్రమైన వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా విపత్తు ప్రణాళిక నిర్వహణను భారత ప్రభుత్వం అమలు చేస్తుంది.

---------------------------

విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని దేవరగట్టులో గత రాత్రి బన్నీ ఉత్సవాన్ని నిర్వహించారు. దీనిపై మరింత సమాచారాన్ని మా కర్నూలు జిల్లా ప్రతినిధి సిహెచ్. రామాంజనేయులు అందిస్తారు.

(వాయిస్-35 సెకన్లు)

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిన్న రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించామని, సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేశాయని ఆయన

తెలిపారు.  టీటీడీ అందించిన సౌకర్యలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శ్రీశైలంలోని దసరా ఉత్సవాలు నిన్నటితో ముగిశాయి. నిన్న రాత్రి అమ్మవారు నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అమ్మవార్లకు నందివాహన సేవను నిర్వహించారు. అనంతరం ఉత్సవాల ముగింపులో భాగంగా ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. చివరి రోజు కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం ఉత్సవాలు ఈరోజు ఉదయం 8 గంటల 45 నిమిషాలకు జిల్లా కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద నుంచి ప్రారంభం కానున్నాయి. అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభకు రాష్ట్ర శాసన సభాపతి సి.హెచ్.అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

మరోవైపు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన “లేజర్ షో” ను గత రాత్రి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు ప్రారంభించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి హరిశ్చంద్ర ప్రసాద్ నిన్న సంయుక్త ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి /ఇంటర్/డిగ్రీ /ఎంబిఏ, ఎంసీఏ విద్యార్హతలు గల 19 నుండి 30 సంవత్సరములు వయస్సు గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో ఉద్యోగ మేళా వెబ్‌సైట్ లో రిజిస్టర్ అవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 84999 43366, 73967 40041నంబర్లను సంప్రదించాలని సూచించారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖ-బ్రహ్మపూర్ -విశాఖపట్నంల మధ్య నడిచే బ్రహ్మపూర్ ఎక్స్ ప్రెస్ రైలుకు అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఈరోజు నుంచి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు బ్రహ్మపూర్ ఎక్స్ ప్రెస్‌కు రెండు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో సముద్రభత్రపై జరుగుతోన్న మలబార్ 2024 విన్యాసాల్లో భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్ దేశాల నావికాదళ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకూ జరిగిన నౌకాశ్రయదశలో బహుముఖ వ్యూహంతో పరస్పర చర్యలకోసం వివిధ స్థాయిల్లో సహకారాన్ని సుస్థిరం చేయడం, నైపుణ్యాన్ని పంచుకునే దిశగా చర్చలు జరిపారు. రేపటి నుండి మొదలయ్యే సముద్ర దశలో గరిష్ట కార్యాచరణ సినర్జీని నిర్ధారించే వ్యూహాలపై చర్చించనున్నట్లు తూర్పు నావికాదళ అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి.

---------------------------

ఉప్పల్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 133 పరుగుల తేడాతో విజయం సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత జట్టు 6 వికెట్లు కోల్పోయి 297 పరుగులు చేయగా లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఈ విజయంతో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ను 3-0 తేడాతో దక్కించుకుంది.

---------------------------

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని పట్టణాలు, పల్లెల్లోని కాలువలు, డ్రైనేజీ మార్గాలను వెంటనే శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఆదేశించారు.

======================